
**నూరేళ్ళ తెలుగు కథకు నవ్య నీరాజనం**



# ఆర్తి ఆర్ద్రత ఆవేదనే నా కథారచన

**- సింగమనేని నారాయణ**

రాయలసీమలో వ్యవసాయం 'జూదం'గా మారింది. రైతుల మెట్టూ కరువు, ధరల్లేకపోవడం అనే 'ఉచ్చు'లు బిగుసుకుంటున్నాయి. ఆరుగాలం శ్రమించినా రైతులు పీకల్లోతు అప్పుల 'ఊబి'లో కూరుకుపోతున్నారు. అనంతపురం జిల్లాలోని ఈ 'అలజడి'ని, ఆటుపోట్లను కథీకరించిన రచయిత సింగమనేని నారాయణ. ఈయన మూడు కథా సంపుటాలు, ఒక వ్యాస సంపుటి వెలువరించారు. అనేక కథా సంకలనాలు, వ్యాస సంకనాలకు సంపాదకునిగా వ్యవహరించారు. అనంతపురం జిల్లా నీటికోసం ఉద్యమించారు. ఉపాధ్యాయుడిగా వృత్తిని చేపట్టి, రచయితగా స్పందించి రచనలు చేసి, బాధ్యతగల పౌరునిగా సాటిమనుషుల మనుగడకోసం ఉద్యమిస్తున్న సింగమనేని నారాయణ గురించి ఈవారం..

### చేతికి దొరికిన ప్రతి అక్షరం ముక్కా చదివా!

మాది అనంతపురం జిల్లాలోని బండమీది పల్లె. మా అమ్మానాన్నలు సంజీవమ్మ, రామప్ప. నేను జూన్ 26, 1943లో పుట్టాను. ఇంట్లో రెండో వాడిని. మొత్తం తొమ్మిదిమంది సంతానం. మా నాన్న ఆ రోజుల్లో ఫోర్త్ ఫారం వరకు చదువుకున్నాడు. కొంతకాలం ఉపాధ్యాయుడిగా కూడా పని చేశాడు. ప్రధానంగా మాది వ్యవసాయ కుటుంబమే! అయినప్పటికీ చిన్నప్పటినుంచీ చాలా పుస్తకాలు, పత్రికలు తెచ్చియిచ్చి నాతో చదివించి నాలో సాహిత్య పఠనాభిలాషను పెంపొందించిన వాడు మా నాన్నే! రెండో తరగతి నుంచే నేను చేతికి దొరికిన ప్రతి అక్షరం ముక్కనూ చదివేవాడిని.

స్కూలు తప్ప మానాన్న నన్నెప్పుడూ వ్యవసాయప్పనులకు పంపించేవాడు కాదు. నాలోని పఠనాసక్తిని గమనించి నాతో చదివింప చేయటమే ఆయనకానందంగా వుండేది.

### మూడో తరగతిలోనే తులసీదాసు రామాయణం చదివాను

మూడవ తరగతి వయసులోనే ప్రతి రోజూ రాత్రి లాంతరు దగ్గర కూర్చుని మూడు నెలల పాటు మానాన్న నాతో తులసీదాసు రామాయణాన్ని చదివించటం ఇప్పటికీ నాకు బాగా గుర్తు. అందుకే బాల్యం నుంచీ కూడా నేను పెద్దగా ఆటల్లో పాల్గొనే వాణ్ణి కాదు. చదవటమే పని. నాకు ఇప్పటికీ గుర్తు.., మా నాన్న ఎప్పుడు అనంతపురం వెళ్లినా అప్పట్లో వస్తున్న బాల మాసపత్రికలు, వావిల కొలను సుబ్బారావుగారు రాసిన 'ఆర్య కథానిధి' పుస్తకాల లాంటివి ఏవేవో తెచ్చి నాచేత చదివించేవాడు. అదే రోజుల్లో మావూరి ఎలిమెంటరీ స్కూలు టీచరు నాగిరెడ్డి సారు నాతో వందలాది పద్యాలు కంఠస్థం చేయించాడు. ఆయనది అద్భుతమైన కంచుకంఠం. ఆయనలాగానే పద్యం చదవాలని నేను ఎప్పుడూ పరిశ్రమ చేసేవాణ్ణి. ఈ రోజు పద్యాన్ని, గేయాన్ని చక్కగా చదువుతున్నానంటే నాకు ఆయన ఆదర్శం కావటమే కారణం.

### ఆర్థిక పరిస్థితి బాగోలేక నాలుగేళ్లు చదువు ఆగిపోయింది...

బాల్యంనుంచి ఈ రోజు వరకు కూడా చదవటం తప్ప వేరే పనిలేదు. పదహైదేండ్ల వయసుకే కొన్ని వేల పుస్తకాలు చదివి వుంటాను. అప్పట్లో మా వూరి పంచాయతీ లైబ్రరీలో వేయి పుస్తకాలుండేవి. అన్నీ చదివేశా. ఏడునుంచి ఎస్ఎస్ఎల్సి వరకు అనంతపురంలోని సాయిబాబా నేషనల్ హైస్కూల్‌లో చదివా. పియుసి అనంతపురంలోనే చదివా. ఆర్థిక పరిస్థితుల కారణంగా నాలుగేళ్ల పాటు నా చదువు ఆగిపోయింది. ఆ నాలుగేళ్లు కూడా పుస్తకాలు చదవడమే పని. ఇంటికి దూరంగా పంచాయతీ ఆఫీసులో కూర్చుని ఉదయం 8నుంచి రాత్రి 2గంటల వరకు పుస్తకాలు చదివేవాడిని. సాహితీ, సామాజిక జ్ఞానం లేని రోజుల్లోనే వేలాది పుస్తకాలు చదివేశాను.

### 22 రోజుల్లో 400 పేజీల నవల..

సాహిత్యం మీది ప్రేమతో విద్వాన్ చదవటం కోసం 1964లో తిరుపతి చేరా. ప్రభుత్వం స్కాలర్ షిప్ ఇచ్చేది.1968కి విద్వాన్ పూర్తయింది. వందలాది కథలు చదివిన ప్రేరణతో ఏ ప్రపంచ జ్ఞానమూ లేని రోజుల్లో నా 17వ సంవత్సరంలో 'న్యాయమెక్కడ' అనే కథ రాశాను. అది కృష్ణాపత్రికలో 2 జూలై, 1960లో అచ్చయింది. తర్వాత రాసిన కథలేవీ అచ్చుకాలేదు. యిది పని కాదనుకుని నవలలు రాయడం మొదలు పెట్టాను. 20 ఏళ్ల వయసులోనే 'ఆదర్శాలు అనుబంధాలు', 'అనురాగానికి హద్దులు', 'ఎడారి గులాబీ' అనే మూడు నవలలు రాసినా. ఈ నవలల్ని దేశంలోనే ప్రసిద్ధి పొందిన ప్రచురణ సంస్థ 'ఆదర్శ గ్రంథమండలి' వారు ప్రచురించారు. 22రోజుల్లో 400 పేజీల 'ఆదర్శాలు అనుబంధాలు' నవల రాశాను. దానికి అప్పట్లో ఆదర్శమండలి వారు 400 రూపాయలు ఇచ్చారు. విద్వాన్ చదువుతున్న రోజుల్లోనే ఈ నవల అచ్చయింది. ఇవన్నీ కూడా మార్క్సిజం పరిచయం కాకముందు రాసినవి.

### నా జీవితాన్ని మలుపు తిప్పిన 'మహాప్రస్థానం'

నా సాహితీ జీవితాన్ని మలుపు తిప్పింది శ్రీశ్రీ 'మహాప్రస్థానం'. విద్వాన్ చదివే రోజుల్లో సాహిత్య చరిత్ర చెప్పే లెక్చరరు ఒకరు కొన్ని గీతాలు చెప్పాడు. వాటిని విని 'మహాప్రస్థానం' కోసం తిరుపతంతా వెతికినా. ఆ పుస్తకం దొరకలా. తిరిగి మా లెక్చరర్ యింటికే వెళ్లి మహాప్రస్థానం తెచ్చుకున్నా. నాలుగు రోజులు రూములో కూర్చుని అందులోని మొత్తం గీతాలు కంఠస్థం బట్టేశా. మహాప్రస్థానం నుండి మార్క్సిజంలోకి వచ్చాను. ప్రపంచం పుట్టినప్పటినుంచి మార్క్సిజాన్ని మించిన మహోన్నత మానవీయ తత్వశాస్త్రం ఇంతవరకూ రాలేదు. మానవ శ్రమ లేని తిండి దొరుకుతుందా? శ్రమ జీవికి మనం రుణపడి వుండాలి. ఆ తరువాత ఆధునిక సాహిత్యాన్ని పరిశీలన దృష్టితో చూశాను. మళ్లీ గొప్పగొప్ప పుస్తకాలు చదవడం ప్రారంభించా. పది ఏళ్లు చదివా. తర్వాత 1974లో రెండో కథ 'జూదం' రాశా. ఇప్పటికీ నాకు నచ్చిన నా కథఇదే! ఇప్పటి వరకూ సుమారు 50 కథలు రాశాను.

### సంపాదకునిగా

రాయలసీమ రైతు ఎదుగూ బొదుగూలేని స్థితిని తెలుగు సాహిత్యలోకానికి చెప్పాలనే ఉద్దేశ్యంతో నేను 1992లో 18 కథలతో 'సీమ కథలు' సంకలనం చేశాను. అది తెలుగు కథా సంకలనాల చరిత్రలోనే ఒక మలుపు. నిర్దిష్టమయిన, ప్రాంతీయమైన ఒక ఒరవడిని దిద్దిందా పుస్తకం. చాలామంది సీమ రచయితలకు వస్తువులు వెదుక్కునే సమస్యను ఆ సంకలనం తప్పించింది. అనంతపురం జిల్లా కరవు కథలతో వెలువడిన 'ఇనుప గజ్జెల తల్లి' సంకలానికి కూడా నేను సంపాదకత్వం వహించాను. విశాలాంధ్ర వారు తెచ్చిన 'తెలుగు కథ' సంకలనానికి సంపాదకవర్గ సభ్యులలో నేనూ ఒకడిని. 'తెలుగు కథకులు కథనరీతులు' అనే సాహిత్య వ్యాసాల సంకలనాలకు మధురాంతకం రాజారాంగారితో నేనూ సంపాదకత్వం వహించాను.

### నా జీవితం చాలా విన్నది

తక్కువ కథలు రాయడానికి కారణం ఎక్కువ కథలురాయలేకనే! నా జీవితం చాలా చిన్నది కావటం వలన, నాకు తెలిసిన జీవితం పరిమితమైంది కావటం వలన, నాకు తెలిసిన జీవితాన్ని మాత్రమే రాయాలనుకోవటం వల్ల నేను తక్కువ కథలు రాశాను.

### రచయిత నుంచి ఉద్యమకారుడిగా..

సమాజంలోని సమస్యల పట్ల స్పందించడం అనేది, క్రియాశీలకంగా పాల్గొనడం అనేది రచ

విద్వాన్ చదివే రోజుల్లో సాహిత్య చరిత్ర చెప్పే లెక్చరరు ఒకరు కొన్ని గీతాలు చెప్పాడు. వాటిని విని 'మహాప్రస్థానం' కోసం తిరుపతంతా వెతికినా. ఆ పుస్తకం దొరకలా. తిరిగి మా లెక్చరర్ యింటికే వెళ్లి మహాప్రస్థానం తెచ్చుకున్నా. నాలుగు రోజులు రూములో కూర్చుని అందులోని మొత్తం గీతాలు కంఠస్థం బట్టేశా. మహాప్రస్థానం నుండి మార్క్సిజంలోకి వచ్చాను. ప్రపంచం పుట్టినప్పటినుంచి మార్క్సిజాన్ని మించిన మహోన్నత మానవీయ తత్వశాస్త్రం ఇంతవరకూ రాలేదు. మానవ శ్రమ లేని తిండి దొరుకుతుందా? శ్రమ జీవికి మనం రుణపడి వుండాలి. ఆ తరువాత ఆధునిక సాహిత్యాన్ని పరిశీలన దృష్టితో చూశాను. మళ్లీ గొప్ప గొప్ప పుస్తకాలు చదవడం ప్రారంభించా. పది ఏళ్లు చదివా. తర్వాత 1974లో రెండో కథ 'జూదం' రాశా.

## నచ్చినవి

| | |
|---|---|
| కథ | : ఎడారి కోయిల (మధురాంతకం రాజారాం) |
| నవల | : రథచక్రాలు (మహీధర రామ్మోహనరావు) |
| కథకుడు | : కొడవటిగంటి కుటుంబరావు |
| కవి | : శ్రీశ్రీ |
| పాట | : ఏరువాక సాగారో రన్నో చిన్నన్నా (రోజులు మారాయి) |
| గాయని | : జానకి |
| గాయకుడు | : ఘంటసాల |
| నటుడు | : చంద్రమోహన్ |
| నటి | : జమున |
| సినిమా | : మిస్సమ్మ |
| వంట | : రుచిగావున్న ఏవంటైనా |



భార్య గోవిందమ్మతో....

యిత నైతిక బాధ్యత. రైతే మన కథావస్తువుకు కేంద్రం కాబట్టి నేను రైతు సంఘాలతో పని చేశాను. 2002లో అనంతపురంలో జరిగిన సిపిఎం రాష్ట్ర మహాసభలకు ఆహ్వానసంఘం అధ్యక్షుడిగా కూడా పని చేశాను. ఆ సందర్భంగా రైతుల పంటలకు గిట్టుబాటు ధర, సాగునీరు, ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మేమంతా ఉద్యమించాం. ఆ సందర్భంగా నేను అరెస్టయ్యాను. మా ప్రాంతానికి సాగునీటికోసం జరిగిన ఉద్యమాలలో 'హంద్రీ నీవా జల సాధన సమితి' ప్రధానమయినది. దీనికి నేను కన్వీనర్‌గా వుంటూ నావంతు బాధ్యతను రచయితగా నిర్వర్తించాను. ఎన్నెన్నో గ్రామాలలో సాగునీటికోసం సమావేశాలు నిర్వహించాము. ఒక కోటిమంది నివసించదగ్గ భూభాగం వున్న అనంతపురం జిల్లాలో 35 లక్షల మంది మాత్రమే జీవించే దుస్థితికి కారణం సాగునీరు లేకపోవడమే. మా జిల్లాల్లో రైతుల ఆత్మహత్యలు ప్రబలమవుతున్న రోజుల్లో వాటిని ఆపటానికి ప్రజా సంఘాలతో కలసి 'రైతు ఆత్మ విశ్వాస యాత్ర' కూడా నిర్వహించాము. ఆ సందర్భంగా ఎన్నెన్నో గ్రామాల్లో పర్యటించాము.

### మీ జీవితంలో మరచిపోలేని అనుభవం

చాలా సాధారణ జీవితం నాది. గొప్ప స్మృతిగా మిగిల్చుకోదగిన ఆనందాలేవీ నా జీవితంలో లేవు. పదిమంది రచయితలతో కలసి మాట్లాడుకోవడం ముచ్చటించుకోవడం నాకు చాలా ఆనందకరమైన విషయం. అందుకే ఎన్నో రచయితల సభల్లో పాల్గొంటున్నాను. మా రాయలసీమలో ఎక్కడ సాహిత్య సభ జరిగినా విధిగా నేను హాజరవుతాను. అయితే నా సాహిత్య శిల్పాన్ని ప్రభావితం చేసింది కొడవటిగంటి కుటుంబరావు. నా భావజాలాన్ని ప్రభావితం చేసింది శ్రీశ్రీ.

### ఇప్పటి కథలెలా వున్నాయి?

ఇప్పుడు కథలలో విపరీతంగా వస్తు వైవిధ్యం పెరిగింది. అన్ని ప్రాంతాలనుండి, అన్ని వర్గాల నుండి, అన్ని వృత్తులనుండి, అన్ని కులాలనుండి రచయితలు పుట్టుకు రావడం వలన తెలుగు కథలో జీవిత వైవిధ్యం విస్తారంగా పెరిగింది. ఇప్పటి యువత చాలా సమర్థవంతంగా కథ రాస్తున్నారు. ఎందరికో తెలియని జీవిత వస్తువుల్ని స్పృశిస్తున్నారు. ఈ వస్తు విస్తృతి మున్ముందు మరింత పెరిగే అవకాశం కూడా వుంది. గతంలో రైతు జీవితం తెలుగుకథలో తగినంత ఆదరణకు నోచుకోలేదు. యిప్పటి కథకులయితే రైతును గురించి, గ్రామీణ జీవితం గురించి ఎంతెంతో రాస్తున్నారు. అది గొప్ప మలుపు. ప్రతి కథకుడు సాహిత్యంలోనైనా రైతును బతికించాలని నేను కోరుకుంటున్నాను.

### కథకులకు మీరిచ్చే సందేశం?

జీవితంలో ఒక పార్శ్వాన్ని, ఒక జీవిత శకలాన్ని మాత్రమే చెప్పగలిగి వుండాలి. కథ ఏక లక్ష్యం కలిగి వుండాలి. దాన్ని సాధించడానికే కథా నిర్మాణం సాగాలి. కథ చదవటం పూర్తి కాగానే కథకుడు ఎందుకోసం ఈ కథ రాశాడు అనే అనుమానం పాఠకునికి వస్తే అది చక్కని కథ కాదు.

### 32 ఏళ్లు తెలుగు పండితునిగా పనిచేశా!

1969లో అనంతపురం జిల్లాలోని నార్పల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలుగుపండితునిగా ఉద్యోగంలో చేరా. 32 సంవత్సరాలు అదేవృత్తిలో కొనసాగి రిటైరయ్యా. నాది చాలా సాధారణ జీవితం. 1969లో గోవిందమ్మతో నాకు పెళ్లయింది. మాకు ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. అందరూ స్థిరపడ్డారు. ఒక కథ రాయడానికి నాకు వారం,పది రోజులు పడుతుంది. అప్పుడు కొంచెం అప్పుడు కొంచెం రాసేవాడిని. అందువలన నేను కథ రాసినట్టుగా కూడా యింట్లో తెలీదు. దీంతో నా కథా రచన అనేది ఇంట్లో వాళ్లకు ఇబ్బందిగా మారలేదు.

–సుంకోజి

### నాకు నచ్చిన నా కథ

# జూదం

- సింగమనేని నారాయణ

మూడు గంటలప్పుడు రెండో విడత ఇంత ముద్ద తిని తోట దగ్గరకు బయలుదేరాడు నారప్ప. దారిలో రామశేషయ్య ఎదురై ''ఏం నారప్పా! బట్టలప్పు ఇయ్యనే ఇయ్యక పోతివి. సంవత్సరం దాటిపాయె'' అని హెచ్చరించాడు.

''బొత్తిగా ఎసులుబాటు గాలేదు శేషయ్యా! నాకు మాత్రం నీ బాకీ నిలపాలని వుందా''

''రాగులూ, జొన్నలూ మంచి పంటే అయ్యిందంటనే-అమ్మినావా''

''ఏందమ్మడమప్పా, అడిగే నాతుడే లేకపోతే! మనమై మనం కొంటవా అంటే, మూట అరవై లోపుగానే బేరమాడితే ఎట్లా చచ్చేది. నిరుడు నూటికి పై నుండే ధర, వుట్టుపాటుగా అరవైకే తెగనమ్మాలంటే మనసెట్టా వప్పుతాది. ఓ వైపు కరెంటు బిల్లు కట్టల్ల- తనకా బేంకోల్లు జీపుల మీద జీపుల్లో వస్తూనే ఉన్నారా! వుండేకేమో పది మూట్లు జొన్నలూ, పదిమూట్లు రాగులూ వుండాయనుకో. ఏంజెయ్యల్లో దిక్కేతెల్లేదు.''



''మీ కత జూస్తే ఇట్లా ఉంది. నా కత జూస్తే దబ్బాడితేగాని పొట్ట గడవదాయే. మీలాంటోల్లందరికి అప్పులిచ్చి అంగడి ఎండక పొయ్యిందనుకో. ధర్మారం నుండి అప్పులోల్లు మనిషి మింద మనిషిని పంపుతుండారు. మీ లాంటోల్లు ఎప్పుడిదప్పుడు ఇస్తే గదా నాకూ జరుగుబాటయ్యేది. కటినిట్టుగా అడుగుతున్నాననుకోవద్దు నారప్పా! ఓ వారం దినాల్లో బాకీ మాత్రం పైసలు చెయ్యాల్సిందే. అంగట్లో బొత్తిగా సీపు ముక్కలు కూడా లేవు. దసరా వస్తోంది. దసరా కన్నా రొవన్ని బట్టలు అంగట్లో ఏసుకోకపోతే ఎట్లా-వస్తామరి'' అంటూ సమాధానం కూడా ఆశించకుండా ముందుకు సాగిపోయాడు రామశేషయ్య

నారప్ప సన్నగా నవ్వుకున్నాడు. రామశేషయ్య వ్యవహారం నారప్పకు తెలీందేమీ గాదు- ఇరవై ఏళ్ల కిందట గుగ్గుళ్ల గంపతో వ్యాపారం మొదలుపెట్టిన రామశేషయ్య ఈనాడు తనలాంటి రైతుల్ని చుట్టూ తిప్పుకొనే వాడయ్యాడు. అప్పట్లో రైతులందరి దగ్గరా నయంగా మెలిగి పాతికో పరకో వాళ్ల దగ్గరే చేబదుళ్లు తీసుకొని చిన్న అంగడి పెట్టుకున్నాడు. రైతుల కల్లాల దగ్గరకు తినుబండారాలు తెచ్చి అమ్మి గింజలు పోగు చేసుకొని అమ్మేవాడు. పాపం తండ్రి చచ్చినోడని రైతులంతోయింతో దయదలచేవారు. క్రమంగా అంగడి పెంచుకున్నాడు. మెల్లగా బట్టల వ్యాపారం కూడా తోడు చేసుకున్నాడు. చూస్తూ చూస్తుండగానే మూడంకణాల ఇల్లు కట్టుకున్నాడు. మెల్ల మెల్లగా రైతులకు అవసరాలకు వడ్డీకిచ్చుకుంటూ, ఈనాటికింత వాడయ్యాడు. ఎంత లేదన్నా ఇరవై వేలకు పైగానే వడ్డికి తిప్పుకుంటున్నాడని ఊర్లో అందరూ అనే మాట. ఇంట్లో పెండ్లాం పిల్లల దర్జా బట్టా బాతా, తిండీ తీర్థం చూస్తే ఎట్టాంటి రామశేషయ్య ఎట్టా మారాడబ్బా అనుకోక తప్పదు. ఒక కొడుకును అనంతపురం కాలేజీలో చదివిస్తున్నాడు. ఒక కొడుకు అతనితో

పాటే వ్యాపారంలో నిగ్గుదేలాడు. మంచి సంబంధం చూసి ఈ మధ్యనే బిడ్డకు పెళ్లి చేశాడు. ఇదంతా ఆశ్చర్యంగా మాయలా కనిపిస్తుంది నారప్పకు.

ఇరవై ఏళ్ల కిందట నారప్ప తండ్రి ఇంకా బతికున్నప్పుడు, అన్నదమ్ములింకా భాగాలు విడిపోనప్పుడు, పదెకరాల తరీ, ముప్పయ్ ఎకరాల మెట్టతో ఊర్లో పెద్ద రైతు కుంటుంబం కిందే వారిది లెక్క. తండ్రి చచ్చినాక ముగ్గురున్నదమ్ములూ విడిపోయారు. విడిపోయినప్పుడు ఆస్తితో పాటు మూడు వేలు అప్పు కూడా నారప్ప మీద పడింది. ఆ అప్పయితే తీర్చాడు గానీ, రకరకాలుగా ఈనాటికి కొత్త అప్పులు పేరుకొని ఐదువేల పైచిలుకే అప్పుల్లో పడ్డాడు నారప్ప. బుద్ధి వచ్చినప్పట్నుంచీ కష్టపడుతూనే ఉన్నాడు. పంటలు పండిస్తూనే ఉన్నాడు. అయినా ఇదేం విచిత్రమో ఓమైన అప్పు పెరుగుతూనే ఉంది. ఇదంత తల్చుకొని ''ఏం సేద్యమో! ఏం పాడో! గడియ తీరికలేదు. దమ్మిడీ ఆదాయం లేదు'' అని నిట్టూర్చాడు నారప్ప.

పొద్దు ఏటవాలుతున్నా ఎండ ఇంకా తగ్గలేదు. భుజం మీదున్న టవ్వాలు తీసి నెత్తికి చుట్టుకున్నాడు నారప్ప. బనీను జేబు లోంచి బీడి తీసి వెలిగించుకున్నాడు. పొగ బీలుస్తూ తోట దగ్గరగా వచ్చేసరికి పక్క తోట లోంచి గడ్డిమోపుతో వెంకటన్న ఎదురై ''బీడి ఉంటే ఈ మామా'' అని అడిగాడు నారప్పను. నారప్ప బనీను జేబులోంచి బీడి తీసి ఇస్తూ ''ఇయ్యాలకాడ గడ్డిమోపేటికోయ్'' అనడిగాడు.

''ఆ రామశేషయ్య ఇంతకు ముందొచ్చిండె-వాళ్లావుకు గడ్డి గావల్లంట-కాసింత గడ్డిమోపు తెచ్చెయ్యరా వెంకా అంటేను....'' అని బీడి వెలిగించుకొని, ''వత్తా మామా'' అంటూ ముందుకి కదిలాడు వెంకటన్న.



''రామశేషయ్య పనే బాగుంది'' అనుకున్నాడు నారప్ప. చారడు భూమి లేదుగాని రామశేషయ్య ఇంటి ఆవూ, ఎనుమూ ఉన్నంత నున్నగా ఎవురి ఉన్నాయ్. ఆడింత, ఈడింత గడ్డి అడుక్కొనే తన పసుల్ని మేపుకుంటున్నాడు. ఇంత గడ్డి పండించీ తన పసులు ఆ మాత్రం యాడున్నాయి. ''దమ్మిడీ కర్చు లేకుండా పాలూ నెయ్యి తినే రాత వానికుంది. మజ్జిగ నీళ్ల గతి మనకు పట్టింది'' అనుకుంటూ తోటలోకి అడుగుబెట్టాడు నారప్ప.

చింతచెట్టు కింద పుల్లలేరుకుంటూ కనిపించింది ఎల్లమ్మ.

''ఏం ఎల్లమ్మా! ఎప్పుడూ మా తోట పుల్లలేనా నీకు దొరికేది'' అన్నాడు నారప్ప దగ్గరగా వస్తూ.

వంకున్నదల్లా నడుం పైకెత్తి చూసింది ఎల్లమ్మ. నవ్వు మొగం పెట్టింది. ''ఎప్పుడూ యాడన్నా! మీ తోట మొగం చూడకే వారమైతే-అందరూ నీ యట్ట టోల్లే వుంటారా! ఆ నారపరెడ్డి తోట్లోకి అడుగు పెడితే చాలు మక్కెలిరగదంతా నంటాడు ఆయప్ప కొడుకు. ఏదో మీలాంటోళ్లు ఏమీ అనరనే గదా ఈటి కొచ్చేది. నేనొచ్చే కాటికి ఎవురిదో ఎనుంగొడ్డుంటే బయటకి తోలి ఈ పుల్లలేరు కుంటున్నా'' అంది.

నారప్ప కాస్తంత వుబ్బిపోయాడు. ''అద్సరేగాని, మర్నాడు మడి కలుపుకు నువ్వూ నీ కోళ్లీ రాండి. కలుపు మొక్కలు బాగా పెరిగినాయి'' అన్నాడు.

''అట్లాగేన్నా! నువ్వు పిలిస్తే ఎప్పుడు కాదన్నాము. రొవన్ని మెరపకాయలు పీకియ్యాన్నా, రాత్రి ముద్దలేకి ఏందీ లేదు'' అంది ఎల్లమ్మ.

''ఓర్నీ'' అనుకున్నాడు నారప్ప. ''నువ్వే ఎల్లి ఓ పదికాయలు పీక్కో. సందు చిక్కిందని దులిపేసేవ్.''

''అయ్యయ్యో పిడికెడైతే అయితాయి'' అంటూ మిరప పాదుల్లోకి నడిచింది ఎల్లమ్మ. చింపిరిజుత్తు, పాత చీర, ఏభైఏళ్లు దాటుతున్నా కష్టం చెయ్యక తప్పని ఎల్లమ్మ వేపే చూస్తూ వరి మడివేపు నడిచాడు నారప్ప. మడి చుట్టూ తిరిగి వచ్చేసరికి ఎల్లమ్మ పుల్లల మోపెత్తుకొని బయలుదేరుతోంది. మిరపకాయల మూట సన్నగా చీర మడతల్లో మోకాళ్ల మధ్యలో వేలాడుతోంది.

''నీ కొడుకును సంజప్ప ఇంట్లో జీతానికి పెట్టినావే-ఏమాత్రం వప్పందం''

''ఆ సంజప్ప దగ్గరే వాడి పెండ్లికి మూన్నూర్రూపాయలు తీసుకుండాం గదా. ఈ సంవత్సరం జీతం పెట్టమన్నాడు. బువ్వ పెట్టి బట్టలిత్తానన్నాడు.''

''మున్నూటికేనా? ఊరంతా ఐదు నూర్లిస్తుండారే''

''అయ్యో! ఆ సంజప్ప మెడకేస్తే కాలికి, కాలికేస్తే మెడకూ ఏసే రకం. ఐదు రూర్లడిగితే, రెండేళ్ల వడ్డీ మీ యబ్బ ఇత్తాడేమే అంటాడు. బతుకు జరగడం శానా కట్టమైందన్నా-నేనూకోళ్లీ ముప్పూటలా కట్టపడుతున్నా తిండికే సాల టంలా. వాని కట్టమేమో ఆ సంజప్పకే సరిపాయె. పూటకు పూట సంపాయిచ్చు కోవల్ల. తినల్ల. ఇప్పుడు కోళ్లి ఉత్త మనిషి కూడా కాదు.''

నారప్ప ఏం మాటాడలేదు.

ఎల్లమ్మ ఇంకా తనలో ఏదో గొణుక్కుంటూనే మెల్లగా నడిచి పోయింది.

కూరపాదులకు నీళ్లు పెడదామనే ఉద్దేశంతో తలుపు తెరిచి 'మిషన్ రూమ్' లోకి వెళ్లాడు నారప్ప. స్విచ్ ఆన్ చేశాడు. కరెంటు లేదు. ''ఛూ..'' అని తిట్టుకు న్నాడు. ''ఏం కరెంటో...ఏం పాడో? రోజూ ఇదే అవస్తే....కరెంటు బిల్లులు మాత్తరం టంచనుగా కట్టాల్సిందే! కట్టకపోతే డిస్కనెక్టులూ. టౌనులో సూస్తె యాడ సూసినా ఎప్పుడు సూసినా కరెంటుంటుంది. పల్లె కొంపల కిడసల్లంటే ఏం రోగమో'' గొణుక్కుంటూ రూమ్‌లో నుంచి బయటకొచ్చాడు నారప్ప.

కాళ్లీడ్చుకుంటూ కూరపాదుల్లోకి వెళ్లి కూచున్నాడు. అక్కడక్కడా పెరిగిన గడ్డి పీకేసుకుంటూ ఆలోచనల్లో పడిపోయాడు.

''తనకా బేంకొల్లు'' ఈ పొద్దో రేపో రానే వస్తారు. వాళ్లప్పు నిలపటానికి యాల్లేదు. రెన్నెల్లబట్టీ తిరుగుతుండారు. వాళ్లొచ్చినప్పుడల్లా టిపిన్లు కాపీలు, ఆలెస్సమయితే భోజనాలు కూడా పెట్టల్ల. ఆ బేంకు జవాను రాజయ్యా మరీ జిడ్డు. వచ్చినప్పుడల్లా రెండో మూడో గుంజుకోందీ కదల్డు. ఆలెస్సంచేసే కొద్దీ కర్చులన్నీ బాకీదార్ల మిందే యేస్తారు.''

ఎంత వారించుకున్నా అతని ఆలోచనల్లో డబ్బు అవసరాలు తప్ప మరోటి చోటు చేసుకోలేకపోయాయి.


నారప్ప మనసులోనే, వెంటనే ఇవ్వాల్సిన డబ్బును లెక్క బెట్టుకోసాగాడు. బేంకు అప్పు మున్నూరు.. రామశేషయ్యకు ఎంత లేదన్నా యిన్నూరు.. గానుగ చెక్క బాకీ నూరు.. కిరాణా సరుకులు తెచ్చిన ఎంగటేసులు శెట్టి అంగిట్లో మున్నూరు.. మూడు నెల్లు కరెంటు బిల్లుకు శివయ్యతో తెచ్చింది నూటయాభై.. యీనెల కట్టే బిల్లు యాభై.. ఇలా లెక్కించుకుంటూ మొత్తం ఒక్క వెయ్యీ నూరు అని తేల్చుకున్నాడు. ఇవి తక్షణ అవసరాలు. తీర్చకపోతే మర్యాద దక్కదు. దీంతోపాటు పుట్టింటికొచ్చిన పెద్దబిడ్డకు పండగనాటికి బట్టలు పెట్టి పంపల్ల. ఆ కర్చూ ఎంతలేదన్నా నూటికి తగ్గదు. మడికి యూరియా మూటొ కటి తెచ్చుకోవల్ల. అదొగ నూరు.

చెలిమిలో నీరులా అవసరాలు వూరుతున్నాయి నారప్పకు. ఎక్కువ ఆలో చన చేసేందుకు భయమేసింది.

ఇంట్లో ఉండే రాగులూ జొన్నలూ అమ్మితే యిప్పుడుండే రేటులో ఆ వచ్చేది యామూల కయితుంది? పండిన పంటకు చేతికొచ్చేది, పంటకు పెట్టిన పెట్టు బడీ, లెక్కలు గడితే కూలే గిట్టదే! యాదేవుణ్తో చెప్పుకొనేట్టు. ఓ వైపు కొనాల్సిన సరుకుల ధరలన్నీ వున్నచోట వుండకుండా పెరుగుతూనే వుండాయా! ఎరు వుల ధరలు తగ్గలే! కరెంటు రేటు తగ్గలే. భూమి పన్ను తగ్గలే. బట్టల ధరలు సరేసరి. ఏందబ్బా తగ్గించేది?

నారప్ప ఆలోచనల్లో మునిగి గడ్డి మొక్కకు బదులుగా మెరప మొక్క పీకి, వెంటనే నాలుక కరుచుకున్నాడు.

''నాయనోయ్..నాయనో'' అన్న కేకలు విని వెనక్కు తిరిగి జూస్తే తొమ్మిదేళ్ల కొడుకు కిష్టగాడు పరుగుపరుగున వస్తున్నాడు. నారప్ప కొడుకు వేపే చూస్తూ ఏదో శంకించాడు.




''ఏందిరా కిష్టా'' అన్నాడు కొడుకు దగ్గరకు రాగానే.

''జీపులో ఆ పొద్దు వచ్చినోళ్లు వచ్చినారు నాయనా. నువ్వు బిరీన రావాల్లంట. ఇంటికాడే కూకుండారు'' అన్నాడు వాడు పరుగెత్తుకొచ్చిన ఆయాసంతో వగరుస్తూ.

నారప్పకు బాగా అర్థమయింది.

ఆ వచ్చినోళ్ళు తనకా బేంకోల్లు – వాళ్లు రావటం యిది మూడోసారి.. 'ఎట్ల జేస్తే బాగుంటుందబ్బా' అనుకుంటూనే కొడుకు వెంట కదిలాడు.

దారిపొడుగునా వకటే ఆలోచనలు. ఇప్పుడున్నప ళంగా ఎవర్నడగాలి. అడిగితే శివయ్య యివ్వకపోడు పొద్దున్నే వచ్చి గింజలు కొలవమంటాడు... రేటు దగ్గిర శానా మొండి మనిషి.. చూసి చూసి యింత తక్కువ రేటుకు అమ్మటానికి మనసొప్పలే. అమ్మక పోతే అనువులు తీరేటట్టులేవు. ఈటికే నెలనుండి

అందరి దగ్గరా 'యిదిగో యిదిగో' అంటూ గడుపు కొస్తుండాడు. సరే. ఎట్లయితే అట్లగానీ. సూర్యకిరణాలు బాగా ఏటవాలుగా పడుతున్నాయి. గాలి ఆగి ఆగి మందంగా వీస్తోంది. పొలాల్లోంచి అప్పుడప్పుడు కూతలు వినిపిస్తున్నాయి.

కిష్టిగాడు ముందుగా గంతులేస్తూ నడుస్తున్నాడు. వాడిప్పుడు నాలుగో తరగతి. బలే తెలివైన వాడని అయ్యవార్లంతా తనతో అంటూంటే తన కెంత ఆనందం. వాణ్ణయినా బాగా చదివిచ్చుకోవల్ల. పెద్దోనికెట్లా చదువబ్బలే. ఇంకో ఏడు గడిస్తే వీన్ని అయిస్కూలుకు పంపల్ల. వాడు తన మాదిరి భూమిమింద ఆధారపడకుండా ఓ రకమైన వుద్యోగం చేసి బతుక్కుంటే చాలు. అందుకే వాన్నిప్పట్నుండే సేద్యం పనుల్లోకి బలవంత పెట్టకుండా శ్రద్ధగా సదుకొనేట్లు సూడల్ల. తెల్లవారుజామున వాడు లేసి సదువుతూంటే సందులో ఆడోళ్లంతా పనీ పాట్లకు లేస్తూ వుంటారు. నారప్ప పెదవుల మీద ఒక క్షణం అందమైన మందహాసం మెరిసింది.

దూరంనుండే తన ఇంటి దగ్గర జీపు నిలబడి వుండటం చూశాడు నారప్ప. జీపు చుట్టూ కొందరు పిల్లలూ, ఒకరిద్దరు పెద్దవాళ్లూ మూగి వున్నారు.

కుడి భుజం మీదున్న తువ్వాలు తీసి విదిలించి ఎడమ భుజం మీద వేసు కొని యింటి ముంగిట్లోకి వచ్చాడు నారప్ప.

వరండాలో అరుగుపై కంబడి మీదు సుఖాసీనులై వున్నారు బ్యాంక్ అధికారులు. నడవలో బ్యాంక్ జవాను రాజయ్య నిలబడి వున్నాడు. వాళ్లు తాగి పెట్టిన కాఫీగ్లాసుల మీద ఈగలు ముసురుతు న్నాయి. తలుపు వెనకాల నారప్ప భార్యా, పెద్దబిడ్డా నిలబడి తొంగి చూస్తూన్నారు.

నారప్పను చూడగానే "రావయ్యా రా పెద్దమనిషీ! నీకోసం అర్ధగంటనుండీ కాసుకోనుండాం" అని చిర్నగవుతో ఆహ్వానించాడు వారిలో ఒకాయన. ఆయన నారప్పకు బాగా పరిచయం. ఆ మాటకొస్తే నారప్పకే గాదు ఆ వూల్లో చాలామందితో బాగా పరిచయాలున్నాయి ఆయనకు.

నారప్ప వచ్చి ఎదురు అరుగుమీద కూలబడ్డాడు మాటా పలుకూ లేకుండా.

"మరి లెక్క సరిచేసినావా! మేం యిక్కన్నుండీ వెంటనే వెంకటంపల్లి పోవల్ల. మళ్లీ టైమైపోతుంది" అంటూ ఆయన తొందర చేశాడు.

"నన్నేం ఎగిరి దుంకమంటారా సార్! ఇంట్లో వున్న గింజలమ్ముడు పోందీ నాపిండాక్క్యాడు ఎక్కన్నుంటీ తెస్తాను"

"ఇది మరీ బాగుందప్పా! నా యింటికా ఏమన్నానా! నీ చుట్టూ తిరగబట్టి యిప్పటికి రెన్నెల్లయింది. వచ్చినప్పుడల్లా యిదే మాటేనా?"

"మీరేం జీపుల్లో తిరుగుతారు జీపుల్లో పోతారు. బాదల్లా నాకు గదా! నా పాట్లు నేను పడుతూనే వున్నాను"

"ఏం బాదపడి ఏం ప్రయోజనం.లేచి ఏదో ఒకటి చూడు. మీలాంటి మర్యాదస్తుల యిండ్లకాడ జప్తు గిప్తు అంటే ఏమన్నా బాగుంటుందా" చివరి అస్త్రం ప్రయోగించాడాయన.

"ఏమప్పా నారప్పా! అప్పు తీసుకొనీ యిట్లా దబాయిస్తే ఎట్లాగా! మా ఉద్యోగ ధర్మం మేం చెయ్యల్లా వద్దా! ఒక్కొక్క రైతూ యిట్లా మొండికేస్తే మేం వసూళ్ళు చేసినట్టే"ఇంకో ఉద్యోగి సంభాషణలోకి దిగాడు.

"నా మాటిను నారప్పా! నువ్వడిగితే యింత వూర్లో ఎవరీరు? ఆ చలపతి దగ్గరకో, శివయ్య దగ్గరకో పోయిరారాదా! నువ్వుపంట మామూలుగా వాళ్లకే గదా యిచ్చేది" మొదటాయన సలహా యిచ్చాడు.

నారప్ప రెండు నిముషాల సేపు మాటాడకుండా కూచున్నాడు. ఏమనుకున్నాడో ఏమో, ఏదో నిశ్చయానికి వచ్చినట్టు లేచి "ఒరే కిష్టా! రొవన్ని మంచినీళ్లు తేరా" అని కేకేశాడు. కిష్ట మంచినీళ్లు తెచ్చి యివ్వగానే తాగి, "సరే వూర్లోకి పొయ్యొస్తాను. మీకు అప్పు తీర్చకూడదని నాకేమన్నా కోరికా? నా బాదల్లా గింజలకు రేటు గిట్టలేదనే. ఏం జేస్తాం" అనేసి వూర్లోకి దారి తీశాడు నారప్ప.

నేరుగా శివయ్య యింటి దగ్గరకెళ్లి బయట నుండి గట్టిగా "శివయ్యా" అంటూ కేకేశాడు. లోపల్నుండే 'ఎవరూ' అంటూ ఓ గొంతుకతో పాటు, ఓ తల నిక్కి చూసింది.

"నువ్వా! నారప్పా! రారా! ఏమిటి సంగతి. అసలుసందకాడొచ్చినావ్" అంటూ పిలిచాడు శివయ్య.

"ఆ తనకా బేంకోళ్లు కుతికల మీదికొచ్చి కూకుండారు. ఓ మున్నూరు కావల్ల" అంటూ లోపలికొచ్చి తలుపు వారగా వున్న బెంచీ మీద కూలబడ్డాడు నారప్ప.

శివయ్య ఏం మాటాడకుండా కుర్చీని దగ్గరగా ఈడ్చుకొని కూర్చున్నాడు.

"ఇంట్లో పదిమూట్లు రాగులు పది మూట్లు జొన్నలూ వుండాయి. రేపు వచ్చి కొలుచుకో. ఇంతకూ ఏమాత్రముంది యిప్పుడు రేటు"

"రాగులేమో అరవై ఐదు. జొన్నలు అరవై. అయినా బొత్తిగా గిరాకీ లేదు నారప్పా!"

"ఏం జేస్తాం. అయినకాడికి అమ్మకపోతే అనువు తీరేట్టు లేదు. ఒక రకంగా చూసి ధర తెంచుకో శివయ్యా"

"నా చేతుల్లో ఏముంది నారప్పా! నేనేమన్నా ధర పెంచేవాణ్ణా తగ్గించేవాణ్ణా. టౌన్‌లో రేటు బట్టి కొంటుంటాను. అన్నవస్తులూ పడి వ్యాపారం చేస్తే మూటకు అబ్బా అంటే అర్ధరూపాయి మిగల్దు. ఐనా రాగులూ జొన్నలూ అడిగేవాడే లేడు. రైతుల్ని పోగొట్టుకోలేక తీసుకోవల్సిందేగాని నాకు శానా బరువు నారప్పా ఒక లారీడు సరుకన్నా అయితే ఎక్స్‌పోర్టు కర్చులు తగ్గుతాయి. ఇరవయ్యో ముప్పయ్యో మూటలకయితే దిక్కులేని కర్చులు. బండిలో టౌనుకు తోలల్లంటే మూటకు రెండున్నరకు తక్కువ యెవ్వడూ బండి బాడుగ కట్టరు"

శివయ్య మాటల ధోరణి చూస్తే నారప్పకు దిగులేసింది. "ముందు ఓ మూడు నూర్లీ శివయ్యా. మళ్లా వచ్చి మాట్లాడతా"

"చానా అర్జెంటా"

"నీకత ఇంకా బాగుంది. అవతల వాళ్లు యింటి కాడ కూకుండారయ్యా అంటే"

"రేపు గింజలు కొలవాల మరి. మర్నాడెట్లా సంత గదా! సంత బండ్ల లోనన్నా మూటలు సాగించక పోతాను. రేటు కూడా యిప్పుడు చెప్పినట్లే! నువ్వు మళ్లా గుయ్ గియ్ అంటే బాగుండదు. మూటకు రెండున్నర బండి బాడుగా, రూపాయి వాణిజ్యం పన్నూ తీసివేసే ధర కడతా. ఆపైన నీ యిష్టం"

"బండి బాడుగ కూడా నా నెత్తిమీద వేస్తే ఎట్లా శివయ్యా" నారప్ప గొంతులో జీర పలికింది.

"మరి నన్ను బోడిచ్చుకోమంటావా! నువ్వు బలవంతపెడితే నేను కొంటున్నాగాని, నాకేం దీంట్లో లాభమా, పాడా? పాత రైతువి. సరుకు తీసుకోనంటే బాధపడతావనే కొంటున్నా గాని"

నారప్పవేడిగా నిట్టూర్చాడు. "సరే గాని లెక్క తీసకరా మరి" అన్నాడు మింగలేక కక్కలేకా.

"శివయ్య లోపలికెళ్లి ఐదు నిమిషాల్లో తిరిగి వచ్చాడు. చాలా జాగ్రత్తగా ఒక్కొక్క నోటే ఎంచి నారప్ప చేతికిచ్చాడు 'మున్నూరు' అంటూ.

"లెక్కాచారం చేసి మిగిలింది రేపిస్తాను. పొద్దున్నే జీతగాన్ని పంపిస్తా"అన్నాడు.

నారప్ప సమాధాన మివ్వకుండా డబ్బును బనీను జేబులో పెట్టుకొని యింటివేపు నడిచాడు.

***

## కథాంతరంగం



అనంతపురం జిల్లా వ్యవసాయమూ, రైతుసంక్షోభమే నా సాహిత్యానికి ప్రేరణ. శతాబ్దాల తరబడి కరవు కరాళ దంష్ట్రలకు చిక్కిన జిల్లా మాది. మా జిల్లాలో **30** లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా, కేవలం **3**లక్షల ఎకరాలకు మాత్రమే యిప్పటికీ సాగునీరందుతోంది. మిగతా భూమి అంతా వర్షాధారిత వ్యవసాయమే! అందువలన మా జిల్లాలో రైతన్న వాడు ఎవ్వడూ బాగుపడలేదు. నేను పల్లెటూళ్లలో ఉద్యోగం చేస్తున్న కారణంగా ఎందరెందరో రైతుల వ్యవసాయాన్ని గమనించిన కారణంగా రైతు పట్ల ఆర్ద్రతతో, ఆర్తితో, ఆవేదనతో నా కథా రచన ప్రారంభించినాను. నేను రాసిన 'జూదం, ఊబి, ఉమ్మ, విముక్తి, అడుసు, యక్షప్రశ్నలు, అగాధం, అలజడి, ఒకపయనం యిలాంటి చాలా కథల్లో మా జిల్లా రైతే ఇతివృత్తం. ఈ నేపథ్యం నుంచీనే 'జూదం' పుట్టింది.

– సింగమనేని నారాయణ
**0855-4245244**

మరురోజు పొద్దన్నే ఎనిమిది కూడా దాటకుండానే, శివయ్య సంచులతో జీతగాన్ని వెంటబెట్టుకుని నారప్ప యింటికి వచ్చాడు. ఇంటి ముందున్న పసుల కొట్టంలో, అట్టన మీదనుండి గడ్డిని తీసి, పశువుల ముందు వెదజల్లుతున్నాడు నారప్ప. శివయ్య గొంతు వినిపించి ''అప్పుడే వచ్చినాడే మాన్నుబాపుడు'' అనుకుంటూ కొట్టంలోంచి బయటకొచ్చాడు.

శివయ్య అరుగుమీద కూచొని సంచిలోంచి 'శేరు' బయటకు తీశాడు. ఆ శేరును చూస్తే నారప్పకెప్పుడూ భయమే!

''నీ పెద్ద కొడుకు నరసింహులు కనిపించలేదు నారప్పా'' కుశల ప్రశ్నలు వేశాడు శివయ్య.

''వానికింటి దగ్గరుండే తీరికేడిది? పొద్దున్నే శేనికి పొయ్యినాడు''

''శేన్లో శెనక్కాయ ఏమాత్రం వేసినావీసారి''

''రెండు మూట్లు వేసినా. ఏం లాబం. వాన అతీగతీ లేకుండా పాయె, పావలా పంట కూడా యీసారి కట్టమే. నిరుడు పండిన మాత్రమన్నా చేతికొస్తే కొంత గట్టెక్కొచ్చు అనుకుంటే, నెల రోజులుగా వాన లేక పైరు ఎండక పోతోంది. మీకేం యీ బాదరబందీ లేదు. వానొచ్చినా రాకపోయినా మీరేం ఎండకపోరు''

''అదెట్లా నారప్పా! రైతులు సల్లగుంటేనే గదా మాకూ యింత తిండి''చిరునవ్వు వలక బోశాడు శివయ్య.

'రైతులు సల్లగుంటేనా.. రైతుల్ని పీలిస్తేనా' అని మనసులో అనుకుంటూ ఇంట్లోకి తొంగి చూసి ''ఇదిగో.. ఏమీ..! ఓ గలాసు పాలు పంపీ.. శివయ్య వచ్చినాడు'' అంటూ కేకేశాడు నారప్ప.

పదిగంటలకల్లా బస్తాలు నింపేపని పూర్తయింది. గింజలు కొలుస్తున్నంత సేపూ, ఏదో పోగొట్టుకున్నట్టే బాధపడ్డాడు నారప్ప. ఎవరో దొంగలొచ్చి తన యింటి సంపదను దోస్తున్నట్టు యాతన అనుభవించాడు.

కొసరి కొసిరి బస్తాకు రెండు శేర్ల గింజలు అదనంగా కొల్చుకున్నాడు శివయ్య. నారప్ప బండిమీదనే మూటలు వేయించి తన యింటికి దోలించుకు పోయాడు శివయ్య.

నారప్ప యింత ముద్ద గతికి ఓ గంట తర్వాత, లెక్కాచారం చూసుకొనేందుకు శివయ్య యింటికి వెళ్లాడు.

నారప్ప శివయ్య ఇంట్లోకి అడుగు పెట్టేసరికి, శివయ్య స్నానం చేస్తున్నాడని చెప్తే బెంచీమీద కూచొని బీడీ వెలిగించాడు. ఎదురుగా గోడ మీద వేలాడుతున్న నిలువెత్తు వెంకటేశ్వరస్వామి ఫొటోనూ, ఫొటో చుట్టూ వున్న చిన్నచిన్న కరెంటు బల్బులనూ చూస్తుండిపోయాడు నారప్ప. 'సంవచ్చర సంవచ్చరానికీ యెంగటేసుల బొమ్మ పెద్దదయితోందే' అనుకున్నాడు.

స్నానమూ, పూజా పూర్తి చేసుకొని నుదుటి మీద కుంకుమబొట్టుతో హాల్లోకి వచ్చి ''అప్పుడే వచ్చినావా నారప్పా. సరుకేసినంక మీకతంతా యింతేనప్పా. లెక్క పూర్తీ యిచ్చేదంకా కొంప కాపలా కాస్తారు'' అన్నాడు నవ్వుతూనే. ఆ రకమైన నవ్వు నారప్పకు వంట్లో కంపరం పుట్టిస్తుంది.

''మళ్లా మళ్లా యాడ తిరుగుతాను. ఇచ్చే వాళ్లకేదో యిచ్చేస్తే పానం రవ్వంత కుదుట బడుతుంది. నీకే బాదా కనపడదు''

''సరేలేవయ్యా'' అంటూ కొల్చుకున్న పంటకు ధరకట్టాడు శివయ్య. మొత్తం 1250 రూపాయలు. బండిబాడుగ యాభై రూపాయలు, వాణిజ్యం పన్ను ఇరవై రూపాయలు, మొత్తం డెబ్బై రూపాయలు, సాయంత్రం తీసుకున్న మున్నూరు, ఇంతకు ముందు కరెంటు బిల్లులకు తీసుకున్న నూట యాభై మినహాయించుకొని 730 రూపాయల్లో ఐదు నూర్లిచ్చి తక్కింది రెండు మూడు రోజుల్లో సర్దుతానన్నాడు శివయ్య.




నారప్ప ''ఆ కొదవా వుంటే యీ కూడదా. నాకుండే నూరు బొక్కల్లో మళ్లా యిదొకటా'' అన్నాడు.

''ఇదే మీతో వచ్చిండేది. నేనుగాంగ సరుకు తీసుకుంటానే లెక్క యిస్తున్నా. ఇంగొగరికేస్తే నెలలు తిప్పుతారయ్యా. సంతకు పొయొచ్చినంక నేనే పంపిస్తాలే'' అన్నాడు మొగం మాడ్చుకుంటూ.

నారప్ప యింకేం మాట్లాడలేదు.

డబ్బును బనీను జేబులో జాగ్రత్తగా పెట్టుకొని, లేవబోతుంటే ''వుండయ్యా అంత తొందరేమి'' అని నిలబెట్టి ఇంట్లోకి వెళ్లి ఒక డబ్బా తెచ్చి నారప్ప ముందు బెట్టాడు. ఆ డబ్బా మీద 'శివాలయ నిధి' అని రాయబడి ఉంది.

''లింగ ప్రతిష్ట ఈసారి శివరాత్రికి చెయ్యాలని అందరూ అనుకొనిందే గదా. ఏదో దైవ కార్యం. నీకు తోచింది దీంట్లో వెయ్యవయ్యా'' అన్నాడు.

నారప్ప గుటకలు మింగాడు. ఒక నిమిషం తటపటాయించాడు. ''లింగ ప్రతిష్ట చేయిచ్చేది నువ్వు. లెక్క మమ్మల్నడిగేది ఏం బాగుంటుంది శివయ్యా'' అన్నాడు.

''ఏంది నారప్పా. ఇదేం నా ఇంటిపనా. దేవుడు నాయబ్బసొత్తా! వూరందరి పని. కలిగిందాంట్లో అంతో ఇంతో దేవునికిస్తే పుణ్యమేమీ వూరికే పోదులే. ఆ దేవుని దయవుండల్ల గాని యిట్టాంటివి మనమెంత సంపాదించకూడదు''

నారప్ప చేసేదిలేక రెండు రూపాయల నోటొకటి తీసి వెయ్యబోతే ''మరీ ఇంత అధ్వానమైతే ఎట్లా నారప్పా! ఓ పదన్నా వెయ్యి'' అని బలవంతం చేస్తే గొణుక్కుంటూనే ఆ నోటుకు బదులుగా ఒక ఐదు రూపాయల నోటు తీసి ఆ డబ్బాలో వేసి ''వస్తా శివయ్యా! సంతనుండీ రాగానే లెక్క పంపీ. యిబ్బందులు చానా వున్నాయి'' అని హెచ్చరించి బయటకు నడిచాడు.

మిట్ట మధ్యాన్నం పొద్దు కరకర మంటూంది. వీధిలో నడుస్తూన్న నారప్పకు అదేమంత తీవ్రమైన ఎండలా కన్పించలేదు. ఏదో ఏట్లోకి పారవేసి వచ్చినంత బాధగా వుందతనికి. నిరుటిలాగే ధరవుంటే రెండు వేలన్నా కళ్ల చూడాల్సింది. ఒక రకంగానన్నా వుండేది. ఈ మిగిలింది యాటికని సరిపోతాది! ఆ యంగటేసులు శెట్టీ, రామశేషయ్యా, సందకాటి కల్లా యింటికాడ మూగుతారు. ఎక్కడి పీడ, అనుకుంటూ వాళ్లకొట్ల వేపు నడిచాడు.

శెట్టి అంగట్లో మొత్తమయిన అప్పు మున్నూటికి గాను 250 జమ కట్టాడు. రామశేషయ్య బట్టలంగట్లో ఇన్నూటా నలభైకి గాను ఇన్నూరు జమవేసి మిగిలిన నలభై ఐదురూపాయిల్ని లెక్కబెట్టుకుంటూ యింటిదారి పట్టాడు నారప్ప.

దారిలో నడుస్తూ మడికి తేవాల్సిన యూరియా మూట, ఈ నెలకట్టాల్సిన కరంటు బిల్లూ లెక్కలేసుకున్నాడు. ఇంకా గానుగచెక్క తెచ్చిన గాండ్ల మల్లప్పకూ యివ్వల్ల. శివయ్య ఆ తతిమా లెక్క యిస్తే బొటాబొటీ సరిపోతుంది. పండగకు బట్టలూ, పెద్దబిడ్డకు బట్టలూ, మళ్లా అప్పులే? ఏం బతుకో ఏంపాడో.

నారప్ప తువ్వాలుతో ముఖం తుడుచుకొని యింటి ముంగిట్లోకి అడుగుబెట్టాడు. ఇంటి అరుగుమీద ఓ వ్యక్తి కూచొని సిగరెట్ పీలుస్తున్నాడు. స్లాగు, పాంటూ వేసుకున్నాడు. ముప్పయ్ ఏళ్ళుంటాయి.'ఎవరబ్బా' అనుకుంటూ అనుమానంగానే నారప్ప అరుగు దగ్గరకు వచ్చాడు.

ఆ వ్యక్తి నారప్పను చూడగానే ''పదిగంటలప్పుడు వచ్చినాను, నువ్వు చూస్తే అతీగతీ లే. రామ్మూర్తి పంపించినాడు'' అన్నాడు.

రామ్మూర్తి పేరు చెప్పగానే కరెంటు ఇంజను, అనంతపురం, వాసవీ ఎలక్ట్రికల్స్ షాపూ నారప్ప కళ్ళ ముందు మెదిలాయి.

'' కరెంటింజను బాపతి లెక్క యింకా ఎనిమిది నూర్లుందంట. నెల కిందటనే తెచ్చి యిస్తానని చెప్పింటివంట. నీ కోసం చూసి ఎన్నాళ్లకూ రాకపోతే నన్ను పంపించినాడు రామ్మూర్తి. వెంటనే బాకీ పైసలు చెయ్యకపోతే బాగుండదని చెప్పినాడు. ఇదిగో నీ పేరుతో చీటీ కూడా రాసి పంపించినాడు'' అంటూ ఓ తెల్లకాగితం మడత నారప్ప చేతికందించాడు ఆ వచ్చిన మనిషి.

నారప్ప ఏం మాట్లాడలేదు.

★

*(ప్రజాసాహితి-నవంబర్ 1978)*